

# గొలుసు కథ

ఇంద్రగంటి జానకీబాల

శ్రీలత చిరచిరలాడే ఎండను సహితం లెక్కచెయ్యకుండా చకచకా నడుస్తోంది. చిరుచెమట ఆమె నుదుటిమీంచి నెమ్మదిగా జారుతోంది. ఒకటి రెండుసార్లు కొంగుతో సున్నితంగా ముఖం వొత్తుతుంది. అయినా నడక వేగం తగ్గించలేదు. ఆమెకి తను చేయబోతున్న పనిపట్ల విశ్వాసం అలాంటిది మరి

ఆమె నడకవేగాని కేమాత్రం తీసిపోకుండా సాగుతోంది. ఆమె ఆలోచనల్లోంచి త్యాగం అన్న మాట పదేపదే దూసుకుపోతోంది. అవును. అసలు త్యాగం వున్నప్పుడు స్త్రీ జీవితం పరిపూర్ణమౌతుంది. ఏ స్త్రీ అయినా తన భర్త కోసం, తన పిల్లల భవిష్యత్తుకోసం కొన్ని త్యాగాలు చేస్తుంది. చేసి తీరాలి. తన మూడేళ్ళ చందూకోసం తనీ త్యాగం చెయ్యటం గొప్పేమీ కాదు. ఒక్కొక్క సినిమాలో, ఒక్కో నవల్లో ఎంతెంతేసి త్యాగాలు చేస్తుంటారు. ఇది తన కర్తవ్యం. నిజానికి తన ముచ్చట, చిన్నారి చందూ అందమైన యూనిఫారమ్ డ్రస్‌లో చిన్నచిన్న ఇంగ్లీషు బిలిబిలి పలుకులు పలుకుతుంటే తనకది పన్నీటి జల్లులా వుండదా! అసలీ మామూలు బళ్ళల్లో చదువే చెప్పరు. అక్కడ చదివే వాళ్ళంతా చింకిగుడ్డలు, చీమిడిముక్కులు– ఛీఛీ రోత. తామంత భాగ్యవంతులు కాకపోయినా, వెయ్యిరూపాయల జీతగాడు తన మొగుడు. తనామాత్రం తన పిల్లల్ని పెద్దస్కూల్లో చేర్పించలేదా ఏం!

శ్రీలత కాళ్ళు చటుక్కున ఆగాయి. బంగారంకొట్లోకి అడుగుపెట్టి బ్యాగ్ లోంచి గొలుసు తీసి ఇచ్చింది. అంత క్రితమే బాగా ఎరుగున్న ఆ షాప్ యజమాని శ్రీలతని మర్యాదగా కూర్చోబెట్టి– వివరాలు మాట్లాడి అయిదువందలు చేతిలో పెట్టాడు. మళ్ళీ ఓ రెండునెల్లో వస్తువు తీసుకుంటానని రాయించుకుని శ్రీలత బయలుదేరింది. ఇప్పుడామె మనసు ఆనందడోలికలూగుతోంది. మళ్ళీ ఒకసారి పొద్దుటనుంచీ జరిగిన సంఘటనలు మస్తిష్కంలో తిరగడం మొదలుపెట్టాయి.

• • •

మహత్తరమైన ఇంగ్లీషుమీడియం స్కూలు జాస్మిన్ ఫ్లవర్స్ కాన్వెంట్– అక్కడ ఉపాధ్యాయురాళ్ళంతా సాక్షాత్తూ ఇంగ్లండునుండి దిగిన దొరసానులు— వారు చెప్పే విద్య– దాని విధానము, వారి భాష, దాని అందం అంతా యింతా కాదు. అసలా కాన్వెంటులో చౌకబారు దైన తెలుగు అసలు ఉండనే ఉండదు. అక్కడ పిల్లలు తిట్టుకున్నా ఇంగ్లీషులోనే– కొట్టుకున్నా ఇంగ్లీషులోనే– ఏడ్చినా ఇంగ్లీషులోనే– ఎదిరించినా ఇంగ్లీషులోనే–

ఆ స్కూలుగురించి శ్రీలత పాంప్లెట్స్‌లో చదవటమేకాకుండా వారివారి పిల్లల్ని చదివిస్తున్నవారి ద్వారా చాలా వింది. అలాంటి అద్భుతమైన స్కూల్లో తన బిడ్డని చేరిపించలేని బ్రతుకు వ్యర్థం అనిపించింది. ఎప్పటినుంచో అలా అనిపిస్తూనే ఉంది. అయితే ఈరోజు మళ్ళీ చూసింది. స్కూలువాళ్ళు వేసిన పాంప్లెట్స్. పేపరులోంచి ఊడిపడింది గులాబీ రంగులో–, అంతే శ్రీలత మనసులో అలజడి మొదలైంది. ఇంక నాలుగు నెల్లో చందూకి మూడేళ్ళునిండి నాలుగో ఏడు వస్తుంది. ఇప్పటికే వాడికి సరైన క్రమశిక్షణ లేక పాడయిపోతున్నాడు. వాడ్ని చాలా పెద్దస్కూల్లో చేర్చాలనే ఆశ క్షణక్షణం పెద్దదై మర్రివృక్షమై పోయింది శ్రీలత మనసులో. భర్త ఆఫీసుకెళ్ళగానే పక్కింటి పంకజాన్ని సాయంతీసుకుని జాస్మిన్ ఫ్లవర్స్‌కి వెళ్ళింది: వాళ్ళెంతో అతి మర్యాదగా మాట్లాడి, ముందు అయిదువందలు కట్టి తర్వాత మాట్లాడమన్నారు. అయిదొందల కోసం చూసుకుంటే అసలీ సంవత్సరానికి తన చిన్నారికి ఆ స్కూల్లో సీటు దొరకడం గగనం అనే విషయం ఆమెకు వారు విశదపరిచారు. శ్రీలత తీవ్రంగా ఆలోచించింది. ఈ క్షణంలో తను వెనకడుగువేస్తే తన చిన్నారి చందూ భవిష్యత్తు కుంటుపడుతుంది– ఈ విషయాల భర్తతో చర్చకి దిగినా పని జరగదు. దీని కోసం తన గొలుసు తాకట్టుపెట్టటానికి అతను ఒప్పుకోవచ్చు, ఒప్పుకోకపోవచ్చు. అందుకే ధైర్యంగా తనే నిర్ణయం తీసుకుంది. అసలు పని జరిగితే

భర్తకి ఎలాగోలాగ సమర్థించి చెప్పుకో వచ్చుని తెగించి చేసేసింది.

ఆ చేత్తో స్కూలుకెళ్ళి డొనేషన్‌గా అయిదువందలు కట్టి, రసీదు తీసుకుని అలసిపోయినా ఆనందంతో ఇల్లుచేరింది.

మహేశ్ యింటికి వస్తూనే భార్య మెడలో పసుపుతాడు చూసి అవాక్కయి పోయాడు గానీ, నీరసంగా ఉన్నా-వెయ్యి క్యాండిల్ బల్బులా వెలిగిపోతున్న భార్య ముఖంచూసి అయోమయం పడిపోయాడు

శ్రీలత ఈనాటి మన సమాజంలో అత్యంతాధునిక భావాలు గల యువతి మధ్యతరగతి కుటుంబంలో పుట్టడంవల్ల ఎక్కువ చదువుకోలేకపోయాను గానీ లేకపోతే తనూ పెద్దచదువులు చదివి, ఈపాటికి ఏ బ్యాంక్ ఉద్యోగంలోనో ఉండేదాన్ని అని చాలాసార్లు అనుకుంటుంది. అలాగే ఎక్కువ కట్నం ఇవ్వలేని కారణంగా సాధారణ గుమాస్తా మహేశ్‌కిచ్చి తన్ని పెళ్ళిచేశాడు నాన్న అని కూడా అనుకుంటుంది. అయితే శ్రీలతకి తనపిల్లలు మాత్రం ఇలాగే ఉండిపోవడం ఇష్టంలేదు. చాలా పెద్దచదువులు చదివి గొప్ప వుద్యోగాలు చెయ్యాలి- అందుకే తను తిన్నా తినక పోయినా చందూ కన్నీ అమర్చి మనం గొప్పవాళ్ళం అనే భావాన్ని కలిగించటానికి మొదటినుంచి ప్రయత్నిస్తూనే వుంది - తనని మమ్మీ అనే పిలవాలి- నాన్నని డాడీ అనే పిలవాలి - మరోలా ఎప్పుడైనా పిలిస్తే అంత ముద్దుచేసే చందూకి చెంపదెబ్బ తప్పదు-.

ఇలాంటి ఆధునిక భావాలుగల యువతిని మహేశ్ మాత్రం ఏమంత అభ్యంతరం పెట్టగలడు?

శ్రీలత చెప్పిందంతా విని గంటు పెట్టుకున్నాడు ముఖం- "ఏమైనా పుస్తెల గొలుసు తాకట్టుపెట్టడం నాకేం బాగా లేదు" అన్నాడు-.

"మరింకేమన్నా వుంటే పెట్టేదాన్ని- లేవుగా" అని కొట్టిపారేసి "ఏంపోయింది రెండునెలల్లో విడిపించేసుకుందాం. ఈ లోగా మన అవసరం గడుస్తుంది" అంది నెమ్మదిగా-.

'మరింకేమీ లేవు' అన్నమాట ఆతనికి ములుకులాగ గుచ్చుకున్నా ఇంకేమీ మాట్లాడలేకపోయాడు. శ్రీలత చెప్పిందాంట్లో అబద్ధమేమీ లేదు. బంగారం మండిపోతున్న ఈ రోజుల్లో భార్యకి అరకాసు పెట్టి నల్లపూసలు కూడా చుట్టించలేకపోయాడు. ఎప్పుడూ ఏదో ఒక ఖర్చు. ఏదో ఒక అడ్డంకి - అస్తమానం గవర్నమెంటు డి.ఏలు ఇస్తూనే వుంటుంది. దానికి మించిన ఖర్చులు ఎదురవస్తూనే ఉంటాయి. ఆ వచ్చే డబ్బు అందంగా ఆకాశంలో మేఘశకలంలా కనిపించి అంతలోనే అందివచ్చే అంది మాయమై పోతుంది-

ఎంత సమర్థించుకుందామన్నా శ్రీలత చేసినపని మహేష్‌కి నచ్చలేదు. పైగా కోపం వస్తోంది.

"పిల్లాడికి నిండా మూడేళ్ళు లేవు. ఏమిటి నీ కంగారు" అని మాత్రం అన్నాడు.

"అలా చెప్పారు. చిన్నతనంలోనే అశ్రద్ధ చెయ్యకూడదు. పునాది ముఖ్యం" అంది శ్రీలత గారిందాలా.

"నా శ్రాద్ధం ముఖ్యం. అయినా నేను ఆఫీసుకెళ్ళి సవాడ్ని వచ్చేలోగా యిన్ని వ్యవహారాలు చెయ్యాలా? నే నొచ్చాక మాట్లాడుకుని చెయ్యొచ్చుగా" — కాస్త గట్టిగా అన్నాడు. శ్రీలత మౌనంగా ఊరుకుంది—

ఆ రాత్రి మహేష్ చిరాకుగా, కోపంగానే ఉన్నాడు. శ్రీలత మరేం సాగలాగకుండా నిశ్శబ్దంగా తన పని తను ముగించుకుంది. పిల్లాడికి పెట్టి పడుకోబెట్టింది — మౌనంగా భోజనంచేస్తున్న భర్తని పలకరించే ధైర్యంచాలక మాట్లాడకుండా అతనికి కావలసినవి వడ్డించి, తనూ తినేసి నడుం వాల్చేసరికి రాత్రి పదైంది. దూరంగా అటుతిరిగి పడుకున్న భర్తని చూసి దేవుడికి నమస్కరించుకుని చాపవేసుకుని పడుకుంది—

మూడు రోజులు గడిచేసరికి మహేష్ కూడా మనసు తిప్పుకున్నాడు. పోనీలే దాని ముచ్చటది. ఏ అచ్చటాముచ్చటా తీరనీ తీరని లేదు అని సరిపెట్టేసుకున్నాడు — అయితే అతని మనసు కుదుట పరుచుకుంటూన్న ఆ సమయంలోనే, టెలిగ్రాము చేతిలో పెట్టాడు మెస్సెంజరు.


తండ్రికి సీరియస్‌గా ఉంది— వెంటనే రమ్మని. అతని కాళ్ళూ చేతులూ ఆడలేదు. మిత్రులందరూ అతనికి ధైర్యం చెప్పారు. రామ్మూర్తి జేబులోంచి రెండు వందలు ఇచ్చి "ఉంచు బ్రదర్, వెంటనే వెళ్ళు ఖర్చులు ఉంటాయి. నాకు తర్వాత ఇద్దువు గాని" అన్నాడు.

పరుగుపరుగున ఇంటికొచ్చి భార్యకి చెప్పి అరగంటలో ట్రైనుకి తయారవమన్నాడు—

శ్రీలత అవాక్కయిపోయింది. కాళ్ళూ చేతులూ ఆడలేదు. డబ్బు చూస్తే లేదు. ఆయనకి సీరియస్ అంటే ఎలా ఉన్నాడు? అరవై పైబడినమాట. ఆయనకేమైనా అయితే ముగ్గురు అన్నదమ్ములు ఖర్చులు వేసుకోవాలి. డబ్బేది?

శ్రీలత చకచకా బట్టలు సర్దుతూ ఆందోళనగా ఆలోచిస్తోంది—

అన్నిటికీ మించిన విషయం. వెళ్ళగానే అత్తగారు మెళ్ళో గొలుసువిషయం అడుగుతుంది. పెద్ద తోడికోడలు స్నేహం నటిస్తూనే విషయం రాబట్టటానికి ప్రయత్నిస్తుంది— తనేం సమాధానం చెప్తుంది? తనేం చెప్తే భర్తేం చెప్తాడో? ఇద్దరూ ఒకే మాట అనుకో దానికి— సమయం లేదు. పైగా తనే గొలుసు గురించి భర్తదగ్గర ప్రస్తా




వించటానికి ధైర్యం చాలడంలేదు. అసలే అతను అలజడిలో బాధలో ఉన్నాడు— తపి విషయం ఎత్తితే కోపంతో ఏం చేసినా చేస్తాడు_

శ్రీలతకి ఆలోచన సాగలేదు. తను తప్పు చేశానేమోనని మొదటిసారిగా పశ్చాత్తాపం కలిగింది, కళ్ళల్లో నీరూరింది___

మహేష్ తన ఆలోచనలో తనున్నాడు గానీ, భార్య మెడలో గొలుసు విషయం మర్చిపోయాడు. నిజానికి మహేష్ తల్లికి ఆ గొలుసుతో చాలా సంబంధం వుంది_ శ్రీలత తండ్రి యిచ్చిన అయిదువేల రూపాయల కట్నంలోనూ, ఆమె పోట్లాడి, పంతంబట్టి తన దగ్గర ఉన్న అరకాసు వేసి, కాసున్నర బంగారం కొని_ రెండు కాసుల పుస్తెల చేయించింది పెళ్ళిలో_ నిజానికి దాన్ని అమ్మాలన్నా, తాకట్టు పెట్టాలన్నా, తల్లికి కోపం వస్తుందని మహేష్‌కి బాగా తెలుసు.

* * *

ప్రమాదం తప్పింది. పెద్దకొడుకు అక్కడే వున్నా, చిన్నకొడుకు రెండో కొడుకు రావడంతో ముసలి దంపతులు ఆనందించారు. అయితే అనుకున్నదంతా జరిగింది_

భార్య మెళ్ళో గొలుసు గురించి కొడుకుని దులిపింది తల్లి. "ఏరా మహేషూ! మెళ్ళో గొలుసు ఎందుకు తాకట్టు పెట్టావు? ఇక్కడికి రావడానికా" అంది.

మహేష్ అవునని వెంటనే అబద్ధమాడలేకపోయాడు _ అలా అని నిజమూ వెంటనే చెప్పలేకపోయాడు _ అతను నసగడం చూసి "అయితే చిల్లరమల్లర ఖర్చులొస్తే గొలుసులు తాకట్టు పెట్టేసుకుంటారన్నమాట! ఖర్చులు సర్దుకోవడం లేకపోతే మానుకోవడం లేదన్నమాట" అంటూ రోజంతా సాధించి వదిలిపెట్టింది.

కోడికోడలు వెమ్మదిగా సన్నాయి నొక్కులు నొక్కుతూ - జాగ్రత్తలు గురించి, పొదుపు గురించి చెప్పి, పెద్ద వాళ్ళ దగ్గర ఉండటంవల్ల ఒక్కొక్క సారి ఎన్ని సరదాలు కోల్పోవాలో చురక అంటించింది.

అప్పటికి శ్రీలతకి మౌనమే శరణ్య మైంది. తప్పంతా భర్తమీదుగానే కొట్టుకు పోతోంది. బాధగా ఉన్నా పెదవి విప్పే ధైర్యంలేదు. మహేష్ కూడా భార్యని బయటపెట్టలేక పోయాడు. మొత్తానికి వెళ్ళిన పని అయిందనిపించుకుని, మూడొందలు ప్రయాణం ఖర్చులు పెట్టుకుని తిరిగొచ్చారు యింటికి—

ఇంటికొచ్చాక గొలుసు విషయం గొడవ జరుగుతుందనుకున్న శ్రీలతకి ఆశ్చర్యమే ఎదురైంది. మహేష్ ఆ విషయమే ఎత్తలేదు.

* * *


స్కూళ్ళు తెరవడం మొదలుపెట్టారు— సీట్లు, డొనేషన్లు ఎడ్మిషన్లు మంచి హడావుడిగా ఉంది. ప్రతి తల్లిదండ్రులకి తమ పిల్లలకి చాలా మంచి స్కూళ్ళలో సీటు కావాలని తాపత్రయ పడటంలో పోటీ పడుతున్నారు.

శ్రీలత తన చందూకి అప్రయత్నంగా సీటు వచ్చేస్తుందని ప్రతిరోజు కార్డుకోసం ఎదురుచూస్తోంది. రోజు రోజుకీ ఆశ సన్నగిల్లడం మొదలుపెట్టింది. పక్కింటి పంకజమే చెప్పింది డొనేషను కట్టేసి కాళ్ళమీద కాళ్ళేసి కూర్చుంటే పనులు సాగవనీ, వాళ్ళ స్కూలుచుట్టూ తిరగాలనీ, ఎవరి చేతనైనా పెద్ద మనుషులతో చెప్పించాలనీను—

శ్రీలత కేం చెయ్యాలో తోచలేదు. భర్తని తొందర చేద్దామంటే ఆతనామాట ఎత్తితేనే కస్సుమన్నాడు— తమ పిల్లాడికి సీటు ఇమ్మని సిఫారుసు చేసే పెద్ద మనుషులెవరూ ఆమెకి తెలీదు— నిరాశా, నిస్పృహలో మగ్గిపోతూ, ఎందుకైనా మంచిదని, ఓ మధ్యాహ్నం పంకజాన్ని తీసుకుని వెళ్తే వాళ్ళు ఇంకా సీనియారిటీలో వాళ్ళ అబ్బాయిపేరు రాలేదనీ వచ్చే సంవత్సరం తప్పక ప్రయత్నం చేస్తామని, చావుకబురు చల్లగా చెప్పారు. శ్రీలత తనకి చేతనైన భాషలో బాధని చెప్పుకుంది. తన బిడ్డని ఏమైనా మీ స్కూల్లోనే చదివించాలని వుందని వాపోయింది. కరస్పాండెంట్ అంతా ఓపిగ్గా విని ఓదార్చి, తన శక్తివంచన లేకుండా సహాయం చేస్తానని చెప్పి పంపేసింది—

అసంతృప్తిలోంచి ఏదో తృప్తిని పోగుచేసుకుంటూ ఇల్లు చేరింది శ్రీలత—

బంగారం కొట్లో గొలుసు అలాగే వుండిపోయింది. తీసుకునే మార్గంలేదు. ఈ మధ్య మహేష్‌కి జాండిస్ రావడంతో పదిహేను రోజులు శలవుపెట్టి సగం జీతంమీద ఉన్నాడు, వచ్చిన జీతంలో ఇల్లు జాగ్రత్తగా గడిపింది. అయినా తన




కంటూ పైసా పైన వచ్చేదిలేదు. ఎలా తను సమర్థించుకోగలదీ అప్పుతీర్చడం అని తెంగపెట్టేసుకుంది, ఉత్సాహం చచ్చిపోయింది...

ఆ రోజు వచ్చిన ఉత్తరం చదువుకుని మళ్ళీ తనలో ఆశ చిగురింపచేసుకుంది. శ్రీలత, నాలుగేళ్ళ క్రితం, ఎవరో మిత్రుల ద్వారా కువాయిట్ వెళ్ళిన అన్నయ రాసిన ఉత్తరం – వారంలో ఇండియా వస్తున్నానని–వచ్చేది ముందు నీ దగ్గరకే అంటూ ప్రేమగా రాశాడు. అది చూడం గానే దట్టంగా అల్లుకున్న మేఘానికి చల్లగాలి తగిలినట్లు ఆమె కళ్ళు అశ్రువు లతో నిండాయి–

మనసులో ఎక్కడో ఆశ– ఆత్మాభి మానాన్ని దెబ్బతీసే ఆశ - పరోక్షంగా నైనా ఆశింపకూడని ఆశ–అది, అన్నయ్య నాకేదైనా యివ్వకపోతాడా? ఎంతోకొంత డబ్బు తనవేదైనా కొనుక్కోమని ఇస్తా డేమో – అదే ఆశ. అలాంటిదే జరిగితే తను ఆ డబ్బుతో గొలుసు తెచ్చి మెళ్లో వేసుకోవాలి. నిజానికి తన భర్త ఎంతో ఉత్తముడు. తను చేసిన తెలివితక్కువ పనికి ఎన్నోమాటలు తనే పడ్డాడు గానీ, తనని బయటపెట్టలేదు. అతనిలో ఆ ఓర్మి తనని కాల్చివేస్తోంది.

* * *

నాలుగేళ్ళ తర్వాత వచ్చిన అన్నని కౌగిలించుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది– అతను చెల్లెలుకి మంచి చీరలు తెండు తెచ్చాడు. చిన్న ట్రాన్సిస్టర్ తెచ్చాడు, చందూకి బొమ్మలు తెచ్చాడు. ఉదయం దిగిన అతను చెల్లెలితో ఎన్నో కబుర్లు చెప్పాడు. బావగారికి మంచి రిస్టువాచ్ ప్రజెంట్ చేశాడు–

శ్రీలత కరిగిపోయింది. ఆమె మనసు తహతహలాడిపోయింది. ఇన్ని తెచ్చిన అన్నగారి మీద అభిమానం పొంగు

కొస్తున్నా — తనకి సమయంలో అయిదు వందలిచ్చి ఆదుకోగల శక్తి ఉన్న ఒకే ఒక వ్యక్తి అతను. తనకా రెండు చీరలూ ఇవ్వకపోయినా ఫర్వాలేదు. కానీ ఎలా చెప్పేది? పైగా తను చెప్పేటప్పుడు భర్త ఉండకూడదు —

సాయంత్రం భర్త అరగంట బయట కెళ్ళగా చూసి చంటూ చదువు గురించి మొదలుపెట్టింది.

"వాడినేమైనాసరే ఇంగ్లీషు మీడియం, పెద్దస్కూల్లో చేర్పించాలని ప్రయత్నం చేస్తున్నామురా. దానికోసం ఆ యిదు వందలు డొనేషన్ కూడా కట్టేశాను. సమయానికి డబ్బులేకపోతే మెళ్ళో గొలుసు తాకట్టుపెట్టి మరీ కట్టాను" అంది— చెప్పడం ఎంత హుషారుగా చెప్దామనుకున్నా, సగంలోనే చప్పబడిపోయింది— అన్నగారి ముఖంలో భావం చూసి గతుక్కుమంది.

"నీ కసలు బుద్ధుందే — డొనేషన్ కట్టావా? పైగా గొలుసుపెట్టానని గొప్పగా చెప్తున్నావా? బావగారు మంచివారు కాబట్టి ఊరుకున్నారు. నేనైతేనా.... ఏమిటే నీ మోజు. మేమంతా మామూలు బళ్ళల్లో చదువుకోలేదా? మన మాతృభాష తెలుగైనప్పుడు అందులో చదువుకోడానికంత నామోషీ ఎందుకు? అసలు చదువుకోవడం అనేది ముఖ్యంగాని ఏ మీడియం అనేది ప్రశ్నకాదు — నేను ముందే అడుగుదా మనుకున్నాను నీ మెడలో పసుపుతాడు చూసి.... కానీ........ నువ్వేమైనా..."

అప్పటికే శ్రీలత చెంపలమీంచి కన్నీళ్ళు జలజల రాలుతున్నాయి.

"ఛ,ఛ! ఆదేమిటి ఇప్పుడు నేనేమన్నాననీ" అతను కంగారుపడ్డాడు—

"కాదు నువ్వేమనలేదు. నేనే కొన్నాళ్ళుగా కుళ్ళిపోతున్నాను— ఒరే! నిన్ను నేనేం అడగలేదు ఇంతవరకు. నాకొక్క అయిదు వందలు అప్పుగా యివ్వు, నెమ్మదిగా తీర్చుకుంటాను — నిజంగా మీ బావగారు మంచివారు కనుక సరిపోయింది, మరొకళ్ళయితే ఎంత రభసయిపోయేదో— అన్నయ్యా! నా కోసం తెచ్చిన చీరలు, సరళకి లక్ష్మికి ఇచ్చేయి పోనీ" అంది—

ఆమె మాటలు పూర్తవకుండానే అతను అయిదు వందలామె చేతిలో పెట్టి "పిచ్చి పిచ్చి ఊహలు పెట్టుకోకు, పిల్లాడ్ని దగ్గర కూర్చోబెట్టుకుని నువ్వు రోజూ చదివించు. ఎంతో గొప్ప స్కూలులో చేర్పించినా తల్లిదండ్రులు శ్రద్ధచూపటం ముఖ్యం. అయినా నీకంత మాత్రం చదువు రాదా"— అతని మాటలు పూర్తవుతుండగానే మహేష్ ఇంట్లో అడుగుపెట్టాడు—

"ఏమిటీ! చెల్లాయిని మళ్ళీ చదువు మొదలుపెట్టమంటున్నారా" అన్నాడు నవ్వుతూ. శ్రీలత సిగ్గుపడి, చెంగున లేచి లోపలి కెళ్ళిపోయింది—

బావా మరుదులు కబుర్లలో పడ్డారు.